# 'అందరినీ ప్రేమించు, అందరినీ భజించు'

ప్రేమరూపము బ్రహ్మంబు ప్రేమమయము
ప్రేమ ప్రేమతో సంధింప నీమమగును
కాన ప్రేమను పూర్తిగా కల్గియున్న
అద్వితీయము నొందంగ నర్హుడగును.

న మోక్షే నాకాశపుష్పే నపాతాళే నభూతలే
అజ్ఞాన హృదయగ్రంధే ర్నాశే మోక్ష యితి శృతిః.

ప్రేమస్వరూపులారా!

మోక్షమన్నది ఆకాశమునుండి ఉట్టిపడదు. పాతాళలోకమునుండి పుట్టిరాదు. భూమియందు మనకు లభ్యముకాదు. అజ్ఞానమును మనం దూరం గావించుకున్నప్పుడే ఇట్టి పవిత్రమైన మోహక్షయము మనకు లభ్యమవుతుంది. 'జంతూనాం నరజన్మ దుర్లభం'. మానవ జన్మ చాలా ఉత్కృష్టమైనది. సౌజన్యమైనది. సౌశీల్యమైనది. అనేక జన్మలపుణ్యఫలము పోగుచేసి అందుకున్న జన్మము ఈ మానవ జన్మము. ఎన్ని తపస్సులో చేసి ఎన్ని ప్రార్థనలో సల్పి ఎన్ని శ్రమలకో మనం ఓర్చి కట్టుకొని నెట్టుకొని ముందుకు సాగిస్తున్నది, ఈ మానవ జీవితము. ఇంత శ్రమించి ఫలించిన ఈ మానవ జన్మమును సార్థకము గావించుకొనక నిరర్థకము చేసుకుంటుకుంటున్నారు, ఈనాడు.

**మానవుని సహజ లక్షణము నివృత్తితత్త్వము**

ఈ మానవ జన్మయొక్క ఉత్కృష్టత ఏమిటి? దీని లక్ష్యము ఏమిటి? దీని గమ్యము ఏమిటి? ఏందు నిమిత్తమై మనము మానవ జన్మ ధరించాము? ఈ సత్యము ప్రతి మానవుడుకూడా గుర్తించవలసిన అవసరముంది. కానీ దురదృష్టవశాత్తు మానవ జన్మ లభ్యమైకూడను ఇట్టి పవిత్రమైన తరుణమునందు దీనిని సద్వినియోగపరచుకోలేక



sri sathyasai vachanamrutam

పోతున్నాము. ఈ విశాల ప్రపంచమందు పశుపక్షిమృగాదులు, క్రిమికీటకాదులు, చీమదోమలు తమ తమ కర్తవ్యములు తాము నిర్వర్తించుకుంటూ వస్తున్నాయి. క్రూరమృగములుకూడా తమ కర్తవ్యము తాము నిర్వర్తిస్తూ వస్తున్నాయి. కానీ మానవుడు తన కర్తవ్యము తాను నిర్వర్తించటం విస్మరిస్తున్నాడు. కాలము ప్రచండమారుతమువలె అతి వేగంగా కదలిపోతున్నాది. దేహమునకు కేటాయించిన ఆయుఃప్రమాణము మంచుగడ్డవలె క్షణక్షణము కరిగిపోవుచున్నది. కానీ, మానవుడు తన కర్తవ్యమును గుర్తించకపూర్వమే కాయమును వదలిపోతున్నాడు. మానవజన్మము లభ్యమై ప్రయోజనం ఏమిటి? ఈ మానవజన్మ ఉత్కృష్టత ఏమిటి? నరజన్మ దుర్లభం-ఏమిటి దుర్లభం? ఈ విషయమును ఏమాత్రము మానవుడు విచారించటంలేదు. గుర్తించటంలేదు. ప్రవర్తించటంలేదు. మానవజన్మ చాలా పవిత్రమైనది. ఇంత పవిత్రమైన జన్మను మనము ఎంతో సదుపయోగము చేసుకోవాలి. కానీ ఈ సదుపయోగము జరగటంలేదు. మన కర్మమును, కాలమును, కాయమును వ్యర్థము గావించుకుంటున్నాము. కారణం ఏమిటి? భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైన ఈ విషయభోగములందే మన జీవితమును అంకితము గావించుకుంటున్నాము. ఈ ప్రాకృత ధర్మములందే మన జీవితము అంకితము గావించి ఇదే మన లక్ష్యమని భావించి ఇదియే గమ్యమని విశ్వసించి సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నారు. ఇవన్నీ ప్రవృత్తి లక్షణాలు. ఇవన్నీ ప్రవృత్తి గుణములే. కానీ మానవుని సహజలక్షణము నివృత్తి తత్త్వము. నిత్యసత్యమైన ఆధ్యాత్మిక తత్త్వాన్ని ఈనాడు విస్మరించి లౌకిక, భౌతిక, ప్రాకృతమైన అనిత్యము, అశాశ్వతము అయిన జీవితమునకు అంకితము గావిస్తున్నాడు.

**మనోమందిరమునందు దివ్యభావములు నింపుకున్నప్పుడే ప్రాకృతభావములు దూరమవుతాయి**

ఎన్ని చదువులు చదివి ఏమి ప్రయోజనము?

**ఎన్ని విద్యలు నేర్చియు నేమి ఫలము**
**తన నొసటివ్రాత తప్పింప తరముగాదు**

srisathyasaivachanamrutam

**చెడ్డబుద్ధులు తన తల చేరెనేని**
**బండబారును బుద్ధులు ఎండబారు.**

ఏమి ఈ విద్యలవల్ల లభించే ఫలము? ఈ విద్యలవల్ల మనము ఏమి సాధిస్తున్నాము? రావణుడు 64 విద్యలు నేర్చాడు. భస్మాసురుడు ఎంతో విద్యావంతుడే! కంసుడు చాలా తెలివితేటలు కలవాడే! నిరంతరము భగవన్నామాన్నే చింతిస్తూ వచ్చాడు. రావణుడు ఎన్నో తపస్సులాచరించాడు. నిరంతరం శివ చింతన చేస్తూవచ్చాడు. శని అర్చన చేస్తూ వచ్చాడు. కానీ ప్రయోజనం ఏమిటి? ఇవన్నీ ప్రాకృతమైన మనోభావముచేతనే సల్పుతూవచ్చాడు. భౌతికమోహములో అర్చనలు గావిస్తూ వచ్చాడు. ఎన్ని విద్యలు చదివినప్పటికి, ఎన్ని తపస్సులు ఆచరించినప్పటికిని, ఎన్ని సాధనలు సల్పినప్పటికిని, ఎంత మంత్రములు ఉచ్ఛరించినప్పటికిని రావణుని రాక్షసగుణము మారలేదు. మనోమందిరమునందు దివ్యభావములు నింపుకున్నప్పుడే ప్రాకృత భావములు దూరమవుతాయి. ఈనాటి మానవుని మనసునిండుకు ప్రాకృతమైన భావములు నింపుకుంటున్నారు. అపవిత్రమైన భావములతో నింపుకుంటున్నారు. అశాశ్వతమైన తలంపులతో మన జీవితము గడుపుతున్నాము. నిత్యసత్యమైన శాశ్వతానందము మనకు ఎట్లా లభ్యమవుతుంది? ఇదికాదు, చేయవలసినది. మన హృదయమును పవిత్రముగావించుకోవాలి. హృదయమునిండుకు ప్రేమను నింపుకోవాలి. ఈ ప్రేమచేత పవిత్రమైన జ్ఞానము పండించుకోవాలి. మానవకోటిమధ్య ప్రేమ బీజములు నాటి సహనప్రసూనములు వికసింపచేసి శాంతిఫలములు సమాజమునకందించేదే ఈనాటి యువకుల ప్రధానలక్ష్యముగా ఉండాలి. సమాజమునకు శాంతి ఫలమునందించే విద్యార్థులుగా తయారుకావాలి.

**ప్రపంచమంతయు బ్రహ్మస్వరూపమే!**

ఈనాడు సమాజము శాంతి నిమిత్తమై అనేకవిధములుగా కాచి ఉన్నది. అయితే శాంతి, భద్రతలు బయట ప్రపంచములో లేవు. శాంతి భద్రతలు తనయందే ఉన్నవి. సర్వము తనయందే ఉన్నది. కానీ ఆ సత్యమును మానవుడు మరచిపోతున్నాడు. స్వస్వరూపమును విస్మరించి బాహ్యరూపమును విశ్వసించి అనిత్యమైన భావములచేత ప్రపంచములో

srisathyasaivachanamrutam

అన్వేషణ జరుపుతున్నాడు, మానవుడు. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' ప్రపంచమంతయు బ్రహ్మ స్వరూపమే! బ్రహ్మలేని స్థానముగానీ, బ్రహ్మలేని నామముగానీ ఈ జగత్తులో మనకు కానరాదు, వినిపించదు. చూచే చూపులు, వినే శబ్దములు, అనుభవించే అనుభూతులు ఇవన్నీ బ్రహ్మానుభూతులే! కంటికి కనిపించునది, చెవులకు వినిపించునది, మనసుకు అనిపించునది, హృదయాన్ని మురిపించునది ఈ బ్రహ్మతత్త్వమే! 'మమాత్మా సర్వభూతాంతరాత్మ' అనే సత్యము చక్కగా అందరు అర్థము చేసుకుంటే ఈ విధమైన అల్లకల్లోలములకు అవకాశమే ఉండదు, ప్రపంచములో. జగత్తులో ఎందు చూచినా కలతలు, కల్లోలములు, కలహములు, ఇంకా ఘోరకృత్యములు జరుగుతున్నవి. ఎవడు మానవుడో, ఎవడు దానవుడో గుర్తించటానికి వీలులేకుండా ఉంటున్నాది. ఎవరు సజ్జనుడో, ఎవడు పశువో అనేదికూడా తెలుసుకోలేకపోతున్నారు. పశుత్వమునుంచి మానవత్వము, మానవత్వమునుంచి వచ్చిన దివ్యత్వమునకు పోవలసిన నరుడు కేవలం మానవత్వమునుండి పశుత్వమునకు రివర్సు తిరిగిపోతున్నాడు. కాదు కాదు. ఇదికాదు, మానవుని ప్రధానకర్తవ్యము. మానవతా ధర్మములను మనము ఆచరణలో పెట్టాలి.

**సత్యం మాతా పితా జ్ఞానం ధర్మో భ్రాతా దయా సఖా**
**శాంతం పత్నీ క్షమా పుత్రః షడేతే జన బాంధవాః**

జనులకు నిజమైన బంధువులు ఇవియే! నిజమైన తల్లి సత్యమే. దీనివల్లనే భారతీయ వేదములు 'సత్యం వద, ధర్మం చర' అని బోధించాయి. సత్యమునకు మించినది మరొకటిలేదు. 'త్రికాలాభాద్యం సత్యం'. దీనిని మార్చుటకు దేశకాల పరిస్థితుల ప్రభావము ఏమాత్రము ఉపయోగపడదు. అట్టి నిత్యసత్యమైన దివ్యత్వమును మనము ఈనాడు మరచిపోయినాము. దివ్యత్వమును దర్శించాలంటే ప్రత్యేక పరిశ్రమలు చేయనక్కరలేదు. దానికిపైన కప్పిన అహంకార మమకారములను దూరము చేసినప్పుడు సత్యము మనకు సాక్షాత్కరిస్తుంది. ఈనాడు మానవుని ఆవరించిన మహాగ్రహములు కేవలం రెండే, రాగ ద్వేషములు. ఈ రాగద్వేషములను మనము నిర్మూలము గావించితిమా, మనకు మనమే బ్రహ్మము. 'సర్వం విష్ణుమయం జగత్'. జగత్తంతా దైవస్వరూపకంగా రూపొందుతుంది.

srisathyasaivachanamrutam

అలాంటి దివ్యత్వము ఏకించిత్తైనా తెలుసుకోటానికి ప్రయత్నించాలి.

**లౌకిక విద్యకంటె ఆధ్యాత్మిక విద్య సులభమైనది**

విద్యార్థులారా! ఆధ్యాత్మికమంటే మీకు శ్రమగా కనిపిస్తుంది. మీరు నేర్చే విద్యలకంటే వేయిరెట్లు సులభమైనది. ఈ లౌకికవిద్యలకంటె ఆధ్యాత్మిక విద్య అత్యంత సులభమైనది. తెలిసికోలేకపోవటంవలన ఇది కష్టంగా కనిపిస్తున్నాది. ABCDలు నేర్చుకున్నప్పుడు మీరు ఎంత శ్రమపడతారు! కానీ క్రమక్రమేణా మీరు విద్యావంతులై డిగ్రీ స్థాయికి వచ్చేటప్పటికి ఈ ABCDలు చాలా చిన్న విషయములుగా కనిపిస్తాయి. ఈనాడు భారతీయ విద్యలు భౌతిక విద్యలుగా రూపొంది ఈ విద్యావిధానములో సరైన నైతిక లక్షణములు లేకపోవటంచేత మానవత్వమును పూర్తిగా మరచిపోతున్నారు. మన హితమైన ధర్మాన్ని మనం విస్మరించిపోతున్నాము.

**MAలు BAలు మక్కువైనందున**
**వేదశాస్త్రములంత పేదబడియె**

ఏమిటి MAలు, BAలు? MAD, BAD! ఇదేనా మనం నేర్చుకోటం? ఇవన్నీ మనను పెడమార్గం పట్టిస్తున్నాయి. కేవలం పొట్టకూటి నిమిత్తమై మనము ఈ చదువులు చదువుతున్నామే కానీ హృదయాన్ని పండించుకునేకోసమని, మనస్సును నిండించుకునేకోసమని మనమీ చదువులు చదవటంలేదు. మనస్సునిండాలి, హృదయం పండాలి. అప్పుడే జ్ఞానం హృదయావేశంగా వస్తుంది. డిగ్రీలు తీసుకున్న వెంటనే Employment Office లో పేరు రిజష్టరు చేస్తారు. దానిచుట్టూ తిరగటము లోపలే కాలమునంతా వ్యర్థము చేసుకుంటారు. ఇదికాదు, మనము చేయవలసిన పని. భౌతిక జీవితమునకు, లౌకికమైన బ్రతుకుకు విద్యలవసరమే కానీ ఎంతకాలమైనా అది సరియైన గుణములను చేకూర్చదు.

**మొట్టమొదట మనకు కావలసినవి నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికములు**

అన్నింటికి మానవతా విలువలు అయిన సత్యధర్మశాంతిప్రేమలు అత్యవసరం

sri sathyasai vachanamrutam

**సత్యధర్మ ప్రేమశాంతులు లేకున్న**
**విద్యలన్నియు నేర్చి విలువ సున్న**
**సత్యధర్మ ప్రేమశాంతులు లేకున్న**
**దానధర్మాల సార్థకత సున్న**
**సత్యధర్మ ప్రేమశాంతులు లేకున్న**
**పదవుల నేలిన ఫలము సున్న**
**సత్యధర్మ ప్రేమశాంతులు లేకున్న**
**బహుళసత్కార్యలాభంబు సున్న**
**మన సనాతనధర్మ హర్మ్యంబు నిలుప**
**గుణములివి నాల్గును పునాదిగోడలప్ప**
**ఇంతకన్నను వేరెద్ది యెరుక పరతు**
**సాధుసద్గుణగణ్యులౌ సభ్యులార!**

ఈ నాలుగు గోడల మధ్యనున్న జీవితము మనది. ప్రతి నివాసమునకు నాలుగు గోడలు ఉండాలి. ఈ నాలుగు గోడలమధ్య జీవించేదే మన జీవితము. ఈనాడు గోడలు కూలిపోయినాయి. నివాసము జరగలేకపోతున్నాది. కేవలము చెట్టునీడ, గుట్టనీడ మన జీవితము గడుపుతున్నాము. ఇదా మానవత్వము? పక్షులు బ్రతకటంలేదా? క్రిమికీటకాదులు బ్రతకటంలేదా? క్రూరమైన మృగములు బ్రతకటంలేదా? అవి ఏ బ్యాంకుబేలన్సు పెట్టుకుంటున్నాయి? ఏ భవనాలు కట్టించుకుంటున్నాయి. ఏమీ లేదు! రేపు ఏమి అనే చింత పక్షులకు లేదు. కానీ మానవుడు 5 yrs plan, 10 yrs plan యింకా వృద్ధి చేసుకుంటూనే ఉంటాడు. పశుపక్షిమృగాదులు అప్పటికప్పుడు ఆనందంగా ఉంటాయి

**జానెడుపొట్ట నింపుకొన చిక్కుల నొందుచు కోటివిద్యలన్**
**పూనిక నేర్చి పరిపూర్ణ సుఖంబును పొందలేక యీ**
**మానవజాతి దుఃఖముల గ్రుగ్గగ నేటికి శ్రీపరాత్పరున్**
**ధ్యానముజేయు భక్తులకు దారిని జూపకయున్నె మానవా!**

srisathyasaivachanamrutam

ఏమిటి మనము చేస్తుండేది?

**నిద్దురనుండి లేచి మరి నిద్దురపోయెడుదాక పొట్టకై**
**హద్దునుపద్దు లేక వ్యయమందగజేయుచు జీవితంబు నీ**
**విద్దెల ధారపోసి అరవిందదళాక్షుని విస్మరించి యే**
**పెద్దసుఖంబు నొందితివొ ప్రీతిగ యోచన చేయు మానవా!**

మొట్టమొదట మనకు కావలసినవి నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికములు. ఇవే ఐదు ప్రాణములలో మూడు ప్రాణములు. ఈనాడు ప్రపంచములో నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికములు అడుగంటి పోయినాయి. ఎక్కడ చూచినా కనిపించటంలేదు. ధర్మము, న్యాయము అడివిపాలైపోయినాయి. అన్యాయ, అనాచార, అక్రమములంతా గ్రామములో నిండిపోయినాయి. ఏ రోగమునకైనా నివారణకు మందున్నదిగానీ ఈ రాగద్వేషములకు మందులేదు. కారణం ఏమిటి? స్వార్థము, స్వప్రయోజనమే!

**లక్ష్యమును పారమార్థికములో ఉంచుకొని ప్రకృతిని అనుభవించండి**

విద్యార్థులారా! స్వార్థము, స్వప్రయోజనము అవసరమే? కానీ పరిమితముగా ఉండాలి. ఈ పరిమితములేక అపరిమిత ఆశలచేత మన జీవితము, అపరిమితమైన దుఃఖమును అనుభవించుతున్నాది. ఏమిటి, ఈ పాంచభౌతిక దేహమునకు సుఖము? ఏమి తిన్నాము? తినటము సుఖమా? నిద్రించటము సుఖమా? పిల్లలను కనటం సుఖమా? ధనము సంపాయించటం సుఖమా? లేదు, లేదు, దేనియందూ సుఖములేదు. ఆ సుఖములన్నీ క్షణభంగురములు.

**మా కురు ధన జన యౌవనగర్వం హరతి నిమేషాత్ కాలః సర్వమ్**
**మాయామయమిదమఖిలం హిత్వా బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా.**
**భజ గోవిందం భజ గోవిందం గోవిందం భజ మూఢమతే**

క్షణములో పోతున్నాయి ఇవన్నీ. పిల్లలు మీకు తెలుసు. 'నేను గొప్ప డిగ్రీ తీసుకోవాలి, నేను డాక్టరు కావాలి, నేను ఇంజినీరు కావాలి, పెద్ద డిగ్రీలు కావాలి', అని ఆత్రుతగా ఉంటారు.

అవి పాసైనప్పుడు సంతోషమని భావిస్తున్నారు. కానీ ఆనందముందా? లేదు. తరువాత ఉద్యోగానికి పోతున్నారు. ఉద్యోగము చిక్కితే ఆనందము అనుకుంటున్నారు. ఉద్యోగం చిక్కింది. ఆనందముందా? అదీ ఒక నెల, రెండు నెలల సంతోషము. తరువాత ప్రొమోషన్ కావాలి. ప్రొమోషనుకు ఆశ పడుతుంటారు. ప్రొమోషను వచ్చింది, కానీ ఆనందముందా? లేదు. ఇక పెళ్లి కావాలి. అది ఆనందమనుకుంటారు. పెళ్లి అయిపోయింది. ఆనందముగాలేదు. ఒక కొడుకు కావాలి అంటారు. కొడుకు పుట్టాడు, ఆనందముందా? తరువాత కుమార్తె కావాలంటాడు, ఆనందముందా? కుమార్తె పుట్టింది. ఆనందమైందా? అప్పటినుండి ఆలుమగలకు జగడాలు. అప్పుడు భగవంతుడు జ్ఞాపకము వస్తాడు. 'ఓ దేవుడా! ఎందుకీ చింతనలో పడిపోతిని, నాకీ కష్టములు నివారణ చేయి' అని ప్రార్థిస్తాడు. అన్నీ తాను కోరుకున్నవే! కోరుకున్నదానిలో ఏదీ శాశ్వతమైన ఆనందములేదు. అన్నీ కదలిపోయే మేఘములవలె పోతున్నాయి. ఎప్పుడు నీకు ఆనందము? వృద్ధాప్యము వచ్చింది. పిల్లల బాధ్యతలు తీర్చి వేసినావు. అప్పుడుకూడా ఆనందము లేదు. కట్టకడపటికి ఎవరిచేతిలో చిక్కుతావో ఏమో? ఏ రోగము వస్తుందో ఏమోనని అక్కడకూడా విచారమే! 90 సంవత్సరములు వచ్చాయి. మంచముపైన పడ్డాడు, అప్పుడూ సుఖము కావాలనే కోరుతున్నాడు. డాక్టరు వచ్చి ఇంజక్షను ఇస్తే, 'సార్ కొంచెం నొప్పి కాకుండా ఇవ్వండి', అంటాడు. సుఖం కావాలి, అక్కడకూడా! పుట్టినప్పటినుండి గిట్టునంతవరకు సుఖం, సుఖం! ఎక్కడ సుఖముంది? అందువల్లనే త్యాగరాజు చెప్పాడు. 'నిధి చాలా సుఖమా ఈశ్వర సన్నిధి చాలా సుఖమా నిజముగ తెలుపుము మనసా' అన్నాడు. ధనకనకవస్తువాహనాదులు అన్నీ వచ్చినాయి ఇంటికి, అన్నింటిని త్యజించాడు. ఈశ్వర సన్నిధి చాలా సుఖము. అన్నీ మనము అనుభవించవలసిందే, కానీ లక్ష్యమును పారమార్థికములో నుంచుకొని ప్రకృతిని అనుభవించండి. తప్పులేదు. లోకసంబంధమైన సుఖములు అవసరమే! కానీ, మితిమీరిన సుఖములు కోరకూడదు. ఎంతవరకో అంతవరకే! అవసరమైనంత మాత్రమే ఉండాలి. ఎంత భుజించుతామో అంత తిరిగి వెలుపలకు పంపకపోతే శరీరము పాడైపోతుంది. ఉరికే భుజిస్తుంటే అజీర్ణరోగము ప్రారంభమవుతుంది. తిన్నదానిని వదలాలి. గాలి పీల్చుకుంటున్నాము. పీల్చుకున్న గాలిని తిరిగి విసర్జించాలి. ఆ గాలిని అక్కడే

srisathyasaivachanamrutam

నిలుపుకోటానికి వీలుకాదు. అదే విధముగా ధనము సంపాయించాలి. ఆ సంపాయించిన ధనము త్యాగము చేయాలి. దానమో ధర్మమో చేసి సద్వినియోగము చేయాలి.

**నీ దుర్గుణములు త్యాగము చేయి**

మన భారతీయ సంస్కృతి అనాదికాలమునుంచి చక్కని పాఠము చెబుతూ వచ్చింది. 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసుః'. ఎన్ని యజ్ఞయాగాది క్రతువులు చేసినప్పటికిని, ఎంతమంది పిల్లలు కలిగినప్పటికిని, ఎంత సంపాయించినప్పటికిని, త్యాగములో ఉంటున్నాది అమృతత్వము. త్యాగములో ఉంటున్నాది మనకు ఆనందము. త్యాగములో ఉంటున్నాది మనకు అమరత్వము. త్యాగములో నున్న ఆనందము మరొక దానిలో లేదు. ఏమిటి త్యాగము చేయాలి. ఇల్లు త్యాగము చేయాలా? ఆస్తి పాస్తులు చేయాలా? కాదు కాదు. భగవంతుడు నిన్నేమీ త్యాగం చేయమని చెప్పటంలేదు. దుర్గుణములు త్యాగము చేయి. నీ సద్గుణములను భగవంతుడు ఏమాత్రము కోరటంలేదు. మీ దుర్గుణాలు భగవంతునికి అందించండి. మీ దుర్గుణమును వేరే ఎవరూ అందుకోరు. కడపటికి తల్లితండ్రులైనా అందుకోరు. 'తల్లితండ్రులు ప్రేమతోనున్నారు. భార్యాబిడ్డలు ప్రేమతోనున్నారు', అని మీరు భావిస్తున్నారు. చాలా పొరపాటు. అందరికంటె గొప్ప ప్రేమ భగవంతునికే ఉండేది. తల్లితండ్రులు పిల్లవాడు అభివృద్ధి అయి దండిగా డబ్బు సంపాయించి సుఖపెట్టాలని ఏదో ఒక స్వార్థము లక్ష్యమునందుంచుకొని ప్రేమిస్తున్నారు. భార్యాబిడ్డలుకూడా అదే రీతిగా మిమ్మల్ని ప్రేమిస్తున్నారు. కానీ, ఏ స్వార్థము, ఏ స్వప్రయోజనం లేకుండా ప్రేమించేది ఒక్క భగవంతుడు మాత్రమే! అట్టి స్వార్థరహితమైన భగవంతునకు నీ దుర్గుణములు అర్పితము చేయాలి. భగవంతునికి సద్గుణములు అర్పితము చేయమని చెప్పటంలేదు. రూములో ఉన్నప్పుడు చెబుతున్నాను సత్యాన్ని మీ వైస్‌చాన్సలర్‌కు, వీరందరికి. ఒక నూరురూపాయల నోటువుంది. ఈ నూరు రూపాయల నోటు చాలా పనికిరానిదిగా ఉంటున్నాది. చాలా మాలిన్యము చేరి వుంటున్నాది. చూడటానికి అసహ్యముగా ఉంటున్నాది. ఎవ్వరూ దీనిని అంగీకరించరు. కానీ అదే నూరు రూపాయలు పనికిరాని నోటు రిజర్వుబ్యాంకుకు ఇయ్యి. వారు దానిని తీసుకొని మంచినోటు

sri sathyasai vachanamrutam

నీకందిస్తారు. నీయొక్క దర్టీ మైండు అనే నోటును ఎవరూ అంగీకరించరు. తల్లి, తండ్రి, భార్య, పుత్రులు ఎవరూ అంగీకరించరు. కానీ, రిజర్వుబ్యాంకు అనే భగవంతునికి అందిస్తే తప్పక అది తీసుకుని మీకు మంచినోటు అందిస్తాడు. భగవంతుడే మీ రిజర్వుబ్యాంకు. మీ దుర్గుణములు దానిలో పెట్టండి. మిమ్మల్ని ఏమి బాధించవు. మీకూ సుఖము, జగత్తుకూ సుఖము. చెడ్డ మీ దగ్గర పెట్టుకోకండి. ఎవరికీ అందించకండి. భగవంతునికి అర్పితము చేయండి. అన్ని కర్మలు భగవత్ప్రీత్యర్థం.

**సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం**

> **త్వమేవ మాతా చ పితా త్వమేవ త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ**
> **త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవదేవ.**

అంతా అర్పితము చేయు. నీ కర్తవ్యము నీవు నిర్వర్తించు. అర్పితము అంటే ఏమిటి? ఏ పని చేయకుండా సోమరిగా కూర్చోటంకాదు. నీవు చేసే సర్వకర్మలు భగవంతునికి అర్పితము చేయి. ఫలితము తానే అందిస్తాడు. వ్రాసే లెటరు వ్రాయవలసిందే! తిరిగి కవరు తీసుకొని పోయి పోస్టాఫీసులో వేయవలసిందే! అంతవరకే నీ కర్తవ్యము. అమెరికాకో, జపాన్‌కో, జర్మనీకో దానిపాటికి అదే పోతుంది. ఆ డిపార్టుమెంటు వేరే ఉంటున్నాది. నీవు ఏమీ యోచన చేయనక్కరలేదు. అక్కడనుంచి బొంబాయి, బొంబాయినుంచి అమెరికా తనే పోతుంది. అదేవిధంగా మీరు మీ ప్రాకృత కర్మలు ఆచరించండి. భగవంతునికి అర్పితమనే కవరును అందించండి. ఈ భగవంతుడు ఎక్కడ మీకు చేర్చాలో ఏ విధమైన సుఖము మీకందించాలో తానే అందిస్తాడు. ఈ నమ్మకము ఈనాడు లేకుండా పోతున్నాది. విశ్వాసము అత్యవసరము. విశ్వాసము లేకపోతే శ్వాసము లేని జీవితమే. ఆ విశ్వాసము ప్రేమతోకూడిన విశ్వాసముగా ఉంటుండాలి. ఆ ప్రేమలేక ప్రయోజనంలేదు.

**భగవంతుడొక్కడే నిస్వార్థమైనవాడు**

ఒక విద్యార్థి ఉండేవాడు. ఆ విద్యార్థి సమీపములో అడవిలో చిన్న ఆశ్రమము కట్టుకోని నివసిస్తూ వుండేవాడు. ఈ పిల్లవాడు ఉదయము వెళ్లటము తిరిగి సాయంకాలం ఇంటికి రావటము. గురువు చెప్పేవాడు.

srisathyasai vachanamrutam

**మాతా నాస్తి, పితా నాస్తి, నాస్తి బంధు సహోదరః**
**అర్థం నాస్తి, గృహం నాస్తి, తస్మాత్ జాగ్రత జాగ్రత.**
**జన్మ దుఃఖం జరా దుఃఖం జాయా దుఃఖం పునః పునః**
**అంత్యకాలే మహా దుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత.**

ఇవన్నీ చెబుతుంటే ఈ పిల్లవాడు 'స్వామీ! మీ బోటివారికి అదంతా సరిపోతుంది కానీ మా బోటివారికి ఇది చెల్లదు', అన్నాడు. లోకములో ఎంతమందో అలాంటి వారుండవచ్చు. నా తల్లితండ్రులు అలాంటివారు కాదు. నా భార్య అలాంటిది కాదు. నేను లేక నా భార్య భోజనం చేయదు. నా తల్లితండ్రులు నేను రావటం ఆలస్యమైతే తలుపుదగ్గర కాచుకొని ఉంటారు. అంత ప్రేమతో ఉంటున్నారు నాపైన. కాబట్టి 'మాతానాస్తి పితానాస్తి' అని చెప్పటంలో అర్థం లేదే' అన్నాడు, విద్యార్థి. 'ఇదుగో చూడు, ప్రత్యక్షప్రమాణముతో నిరూపిస్తాను' అన్నాడు గురువు. ఒకమాత్ర ఇచ్చాడు. 'నీవు ఇంటికి పోతూనే ఆ మాత్ర వేసుకోమన్నాడు. నీవు చచ్చిపడిపోయినట్లు కనిపిస్తావు. కానీ నీ conscience పనిచేస్తుంది. ఎవరెవరు ఏమేమి మాట్లాడుతున్నది నీకు తెలుస్తుంది. కానీ, బాహ్య ప్రపంచమునకు నీవు ప్రాణములేనివాడుగా కనిపిస్తావు. అప్పుడు నీవు ఈ సత్యాన్ని గుర్తించమ'ని చెప్పాడు. చూస్తాము ఇది ఒక టెస్టు. యువకులకు ప్రతిదానికి టెస్టు. పిల్లలకు టెస్టు అంటే టేస్టు. వెళ్లాడు వేసుకున్నాడు. పడిపోయాడు. తల్లి వచ్చింది. తండ్రిని పిలిచింది. కేకలు వేసింది. అయ్యో! కుమారుడు మరణించాడని ఏడుస్తున్నాది. ఈ మాట విని భార్య పరుగెత్తి వచ్చింది. 'అయ్యో! నా గతి ఏమిటి?' అని ఆమె ఏడుస్తున్నాది. 'నా తల్లికి నేను ఒకదానినే కుమార్తె' నా భర్త ఈ విధంగా అయిపోతే నా గతి ఏమిటి?' అని ఏడుస్తున్నాది. ఏడుపులో 'నా గతి ఏమిటి?', అని ఏడుస్తున్నాది? ఇరుగుపొరుగు వారు చేరారు. మంచిపిల్లవాడే! ఆధ్యాత్మిక మార్గములో జీవితాన్ని గడిపేవాడని అందరికి దుఃఖం వచ్చింది, పాపం. ఈ సమయములో ఒక స్వామి వచ్చారు. వచ్చాడు సరైన సమయానికి, అని అందరూ దారి విడిచారు. 'అమ్మా! ఎందుకోసం ఏడుస్తున్నార'ని తల్లిని అడిగాడు. 'నా కుమారుడు మరణించాడు స్వామీ!' అని చెప్పింది. భార్యను అడిగాడు, 'ఎందుకోసం నీవు ఇంత దుఃఖిస్తున్నావ'ని. 'ఇతను నా భర్త, అతను పోతే నా గతి ఏమిటి?' అని ప్రశ్నించింది. అప్పుడు తండ్రితో చెప్పాడు, 'లోపలికి వెళ్లి

sri sathyasai vaahamrutam

గ్లాసులో నీరు తీసుకురమ్మ'ని. కండ్లు మూసుకొని కొంచెం నాటకమాడాడు స్వామి, 'ఈ నీరు ఎవరు తాగితే వారు చస్తారు, ఈ పిల్లవాడు బ్రతుకుతా'డు అని చెప్పాడు. తీసుకువెళ్లాడు భార్యదగ్గరకు. భార్యకదా ప్రీతికరమైన ఆమె. ఆమెకు యిచ్చాడు. 'నీరు త్రాగుతావా అమ్మా!' అని అడిగాడు. 'నా తల్లితండ్రులకు నేను ఏకైక పుత్రికను. నేను పోతే నా తల్లితండ్రులు ప్రాణం తీసుకుంటారు. కాబట్టి నేను త్రాగను' అంది. 'నీ భర్త బ్రతుకుతాడమ్మా! నీవు చావు, తప్పేమి' అన్నాడు. 'చచ్చేవాడు ఎట్లైనా చచ్చాడు. పోతేపోనీ! నేను త్రాగను', అంది. తల్లికి చూపించాడు, 'అమ్మా! నీవు త్రాగుతావా' అని. 'అయ్యో నాయనా! ఇంటికి నా బిడ్డ ప్రసవానికి వచ్చింది. ఆమెకు ప్రసవం చేసేవారు ఎవరులేరు. ఇంకా ఇద్దరు ఆడబిడ్డలున్నారు. వారికి పెండ్లిళ్లు కావాలి. ఇవన్నీ నా బాధ్యతగా ఉంటున్నాది. నేను ఎట్లా చనిపోయేది?' అన్నది. సరే తండ్రిని అడిగాడు. ఆయన యోచన చేశాడు. 'ఇంటికి పెద్దను నేను. ఇద్దరూ ఆడవారే మిగిలిపోతారు. నా కోడలు ముండమోస్తుంది. నా భార్య ముండమోస్తుంది. ఇంటిలో మగదిక్కే లేరు. నేను ఎట్లా చచ్చేది', అన్నాడు. సరే ముగ్గురూ ఒప్పుకోలేదు. ముగ్గురూ లోపలికి వెళ్లారు, మాస్టరుప్లాను వేశారు. 'స్వామీ! మీరు ఎంతో దయామయులు. మీకు ఎట్టి బాధ్యతలు లేవు. ఈ నీరు మీరే త్రాగి నా కుమారుని బ్రతకించండి. మీకు మంచి పాలరాతి సమాధి కట్టిస్తాము', అన్నారు. అప్పుడు వీడు లేచాడు. 'చూచావా! చూడు నీ భార్య ఏమి చెప్పింది? తల్లి ఏమి చెప్పింది? తండ్రి ఏమి చెప్పాడు? కట్టకడపటికి నన్నే చావమని చెప్పారు', అని తెలియజెప్పాడు. జగమంతా మిథ్య. జన్మ దుఃఖం జరా దుఃఖం జాయా దుఃఖం పునఃపునఃఅంత్యకాలే మహా దుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత. ఎవరికి ఎవరు లేరు. ఏదో దేహాభిమానముండినంతవరకు దేహమును వారు ప్రేమిస్తారు. ఇదికూడా స్వార్థము కోసమనే! ఎట్టి స్వార్థములేని నిస్వార్థమైనవాడు భగవంతుడొక్కడే! అట్టి భగవంతుని మీరు ప్రేమించి మిగిలిన సంబంధములను మీరు పోషించుకోండి. తప్పులేదు. ఏ పనిచేసినా అది భగవత్కార్యముగా భావించండి. ఎవరిని చూసినా దైవముగా విశ్వసించండి. అందరియందు ఉన్నది 'మమాత్మ సర్వభూతాంతరాత్మ'. ఎవరిని మనం తూలనాడరాదు. ఎవరితో మనం ద్వేషం కలిగించుకోరాదు. ఎవరితో మనము అధిక విశ్వాసముతో నుండరాదు. అందరి విశ్వాసములు భగవంతునిపై పెట్టండి.

sri sathyasai vahini amrutam

ఇది ఎన్నో దారాలు చేరిన బట్ట. అన్ని దారాలు చేరటం వలన చాలా బలంగా ఉంటున్నాది. ఒక్కొక్క దారం విడివిడిగా తీసుకుపోతే వేళ్లతో త్రుంచి వేయవచ్చు. కాబట్టి అందరి ప్రేమను భగవంతునిపై పెట్టుకో. అందరిని భగవత్స్వరూపకంగా విశ్వసించు. 'అందరిని ప్రేమించు, అందరిని భజించు'. అందరిని విశ్వసించు. అంతేగాని ఎవరిని నమ్మరాదు. ఒక్క దైవమును మాత్రమే నమ్మాలి.

**నైతిక విలువలు పెంచుకోండి, ధార్మికమార్గములో ప్రవేశించండి**

> **దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
> **దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్**
> **మోహనిబంధబంధనల ముద్రలు లేవు నిజంబు జూడ నా**
> **దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!**

క్షేత్రమిది. లోపల క్షేత్రజ్ఞుడున్నాడు

> **మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవకగంప జాతసం**
> **చలనముపొందు దుంప భవసాగరమీదగలేని కంప అం**
> **బుంబులపొది లెమ్ము చూడ మన మెప్పుదలంపగ దేహమింక ని**
> **శ్చలమని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.**

ఈ కలియందు ఇది చాలా అవసరము. ఆ విశ్వాసము మనం కోల్పోవటంచేత దేశము ఇన్ని విధములైన అల్లకల్లోలములతో అశాంతితో కుమిలిపోతున్నాది. నైతిక విలువలు పెంచుకోండి. ధార్మికమార్గములో ప్రవేశించండి. ఆధ్యాత్మికమును అనుభవించండి. లౌకికము మీకు సుఖంగా ఉంటుంది. విద్యార్థులారా! ఈనాడు పాఠశాలయందుగానీ, కళాశాలయందుగానీ ఆధ్యాత్మికముయొక్క సంబంధము ఏమాత్రము లేకపోవటంచేత మనస్సు అనేక పెడమార్గములు పడుతున్నాది. మీ దోషముకాదు. ప్రభుత్వం దోషము. ఎందుకంటే ఆధ్యాత్మిక విద్య ఏమాత్రము లేకపోతున్నాది. ఆధ్యాత్మికమైన పునాది లేక ఈ భవనము ఎట్లా నిల్చగలదు? కాబట్టి self confidence foundation, self satisfaction wall, self sacrifice roof, self realisation life. కనుక self confidence పైన ఆధారపడి ఉండాలి. Self

srisathyasaivachanamrutam

confidence ఆధ్యాత్మికము. ఆత్మవిశ్వాసం లేక ఏ చిన్నకార్యము మనం సాధించలేము. మీకు సమయము చిక్కినప్పుడు పొల్లు మాటలు మాట్లాడక, కాలము వ్యర్థము గావించక కాయమును పెడమార్గము పట్టించకుండా, దుర్మార్గ భావములు తలలో చేర్చకుండా భగవచ్చింతన చేయండి. అదే మీ నిజమైన తరగిపోని ధనము, భవిష్యత్తుకు. అట్టి శాశ్వత ధనమును మీరు సంపాయించాలి. శాశ్వత కీర్తిని మీరు సంపాయించాలి. అప్పుడే మీ జీవితము సార్థకమవుతుంది. సమాజములో ప్రవేశించండి. ఈ సాంఘిక సంక్షేమములో పాల్గొనండి. వారి ప్రేమకు మీరు పాత్రులుకండి. అహంకారము నిర్మూలము చేసుకోండి. దేహాభిమానం పూర్తిగా దూరం చేసుకోండి. దేహము ఎందుకోసం వచ్చింది? ధర్మాన్ని ఆచరించేకోసం వచ్చింది. మీరు నిత్యము శ్రవణము చేసిన విషయాలు ఏ ఒక్కటి రెండైనా హృదయములో దాచుకోండి. అన్నీ దాచుకోటానికి ఈ పెట్టెలో స్థలము ఉండదు. ఒకటి రెండు ముఖ్యమైనవి మీరు దాచుకోండి.

**(తేదీ 16-08-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam